సంక్షేమం శూన్యం.. అభివృద్ధి నేలచూపు



భీమడోలు: పాతూరు వద్ద శిథిలావస్థకు చేరిన వంతెన



భీమడోలు: గుండుగొలనులో నత్తనడకన సాగుతున్న వంతెన నిర్మాణ పనులు

- ఎన్నికల హామీలను విస్మరించిన కూటమి నాయకులు
- ప్రచారానికే పరిమితమైన అభివృద్ధి
- ప్రజాసమస్యల పరిష్కారంపై పాలకుల నిర్లక్ష్యం
- హామీలను నెరవేర్చాలని ప్రజల అభ్యర్థన

భీమడోలు: ఎన్నికల సమయంలో కూటమి నాయకులు సంక్షేమం, అభివృద్ధికి ఎన్నో హామీలు ఇచ్చారు. అధికారం చేపట్టి ఆరు నెలలు పూర్తయినప్పటికీ ఒక్కటంటే ఒక్క హామీని కూడా నెరవేర్చలేదు. సూపర్ సిక్స్ పథకాల అమలుకు, ప్రజాసమస్యల పరిష్కారానికి ఆరునెలలుగా ప్రభుత్వం తీసుకున్న చర్యలు శూన్యమని కూటమి పాలనపై నియోజకవర్గ ప్రజలు పెదవి విరుస్తున్నారు. ఇచ్చిన హామీలను ఎప్పుడు అమలు చేస్తారా అని నియోజకవర్గ ప్రజలు ఎదురు చూస్తున్నారు. అభివృద్ధి పనులపై కూటమి నాయకులు ఇచ్చిన హామీలు ప్రచారానికే పరిమితమై కార్యరూపం దాల్చలేదని నియోజకవర్గ ప్రజలు అంటున్నారు.

మృత్యు ఘంటికలను మోగిస్తున్న వంతెనలు

గోదావరి కాలువపై ఇరుకైన వంతెనలు శిథిలావస్థకు చేరి మృత్యుఘంటికలను మోగిస్తున్నాయి. అభివృద్ధికి చిరునామాగా ఉన్న ఈ వంతెనలు కూలేందుకు సిద్ధగా ఉన్నాయి. ఎన్నికల సమయంలో ఈ వంతెనను నిర్మిస్తామని కూటమి నాయకులు హామీలు గుప్పించి అనంతరం విస్మరించారు. శిథిలావస్థకు చేరిన బ్రిటిష్ కాలం నాటి వంతెనలపై అధిక లోడు వాహనాలు రాకపోకలు సాగించడంతో ఏ క్షణంలో కూరుతాయోనన్న భయం ఆ గ్రామాల ప్రజలను వెంటాడుతోంది. ఇప్పటికే కాలం చెల్లిన ఆ వంతెనలపై సామర్థ్యానికి మించి చేపల చెరువులకు వెళ్లే లారీలు ప్రయాణిస్తూ భయాందోళనలను గురి చేస్తున్నారు. వంతెనలు కూలితే ప్రజాజీవనానికి రైతన్నల పనులకు తీవ్ర విఘాతం ఏర్పడుతుంది.

ప్రజలను వెంటాడుతున్న భయం

భీమడోలు మండలం పరిధిలో గోదావరి కాలువపై పూళ్ల, కురెళ్లగూడెం, భీమడోలు, పాతూరు, గుండుగొలనులో వంతెనలు ఉండగా వాటిలో భీమడోలు తప్ప మిగిలిన వంతెనలు ప్రాణసంకటంగా మారాయి. రెండేళ్ల కితం కూలిన గుండుగొలను వంతెన నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఎంఎంపురం, సాయన్నపాలెం, నిడమర్రుల్లో విస్తరించిన చేపల చెరువులకు భారీ వాహనాల్లో మేత, చేపల లోడ్ లారీలు యధేచ్ఛగా సాగుతున్నాయి. దీనితో అక్కడి వంతెన ఎప్పుడు కూలుతుందోనన్న భయం ప్రజలను వెంటాడుతోంది. కురెళ్లగూడెం వద్ద కాలువపై ఉన్న ఇరుకైన వంతెన రహదారికి ఎత్తులో ఉండడంతో ఆ వంతెనపై నుంచి కొల్లేరు గ్రామాలకు వెళ్లే భారీ వాహన రాకపోకలు తరుణంలో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నారు. పాతూరు వద్ద నిర్మించిన వంతెన గోడు కూలిపోయింది. వంతెనపై బిక్కుబిక్కుమంటూ ప్రయాణించాల్సిందే. ఇకనైనా పాలకులు, అధికారులు తగు చర్యలు తీసుకుని నియోజకవర్గ వ్యాప్తంగా వంతెనలు నిర్మించాలని ప్రజలు వేడుకుంటున్నారు.

రైతు భరోసా సాయం అండగా ఉండేది



పంటల బీమా ప్రీమియం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చెల్లించేది. అంతేగాక రైతు భరోసా సాయం అండగా ఉండేది. రైతులకు పెట్టుబడి సాయంగా ప్రభుత్వం అందించిన సొమ్ము ఉపయోగపడేది. ప్రకృతి వైపరీత్యాల సమయంలో పంటల బీమా ఆదుకునేది. అలాంటింది కూటమి ప్రభుత్వం వచ్చాక రైతుల సంక్షేమం వైపు చేడటంలేదు. రైతులకు ఉపయోగపడే పథకాలు ప్రభుత్వం అమలు చేయాలి.

– దొడ్డి మోహనరావు, రైతు

నూతన వంతెనలు నిర్మించాలి

గోదావరి కాలువపై పూళ్ల వంతెన నిర్మించి 108 ఏళ్లయ్యింది. బ్రిటిష్ కాలంలో నిర్మించిన ఈ వంతెన ఏ క్షణంలో కూలుతుందోనన్న భయం ఈ ప్రాంత ప్రజలను వెంటాడుతోంది. ప్రస్తుత అవసరాలకు ఈ వంతెన సరిపోవడంలేదు. వాహనాల రాకపోకలు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. భీమడోలు, నిడమర్రు, ఉంగుటూరు, గణపవరం మండలాల్లో నూతన వంతెనలు నిర్మించాలి.

– గంటా శ్రీనివాసరావు, ఎంపీటీసీ, పూళ్ల

ఇన్‌పుట్ సబ్సిడీ రాక రైతులు ఇబ్బందులు

ఉంగుటూరు: ఇన్‌పుట్ సబ్సిడీ, పంటల బీమా అందక రైతులు ఇబ్బందుల ఎదుర్కొంటున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సబ్సిడీ సకాలంలో రైతులకు వచ్చేది. దానికి తోడు గత ప్రభుత్వం అందించిన రైతు భరోసా సొమ్ము రూ.13,500 సాగుకు అక్కరకు వచ్చేది. కూటమి ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చడం లేదు. దాంతో రైతు వర్గాల నుంచి వ్యతిరేకత ఎదురవుతోంది. ఉంగుటూరు నియోజకవర్గంలో సుమారు రూ.60 లక్షలు వరకు పంటల బీమా మంజూరు కావాల్సి ఉంది. రైతులు ప్రకృతి వైపరీత్యాలకు పంట నష్టపోయినా పరిహారం అందడం లేదు. ఉంగుటూరు నియోజకవర్గంలో 40వేల హెక్టార్లలో వరి సాగవతుంది. దీంతోపాటు వాణిజ్య పంటలు రైతులు పండిస్తున్నారు. కూటమి ప్రభుత్వంలో రైతులు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



ధాన్యం ఆరుబయట ఉంచిన రైతులు

కష్టకాలంలో రైతులను ఆదుకోవాలి

గణపవరం: సార్వా పంట రైతులను నష్టాల ఊబిలోకి నెట్టివేసింది. రైతులు ఎకరాకు కనీసం 10 వేల రూపాయలు నష్టపోయారు.మరో వైపు దాళ్వా పంట తరుముకొస్తోంది. కూటమి ప్రభుత్వం రైతులకు రూ.20వేలు ప్రతి ఏటా ఇన్‌పుట్ సబ్సిడీగా అందిస్తామని ఎన్నికలలో ఇచ్చిన హామీని కనీసం ఇప్పుడైనా అమలులోకి తీసుకువస్తే రైతులకు ఎంతో ఉపయోగం ఉంటుంది. దాళ్వాకు పెట్టుబడిలేక రైతులు, కౌలు రైతులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమయంలో ఇన్‌పుట్ సబ్సిడీని అందించి రైతులను ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు. పంటల బీమా ప్రీమియం కూడా రైతులపై భారం వేయకుండా ప్రభుత్వమే చెల్లించాలన్నది రైతుల కోరిక. నిరుద్యోగులకు, మహిళలకు, ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

రైతు ఆందోళనకు తరలిరండి



పుప్పాల వాసుబాబు, మాజీ ఎమ్మెల్యే

గణపవరం: వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ ఇచ్చిన పిలుపు మేరకు ఈనెల 13న ఏలూరులో పార్టీ ఆధ్వర్యంలో రైతులకు మద్దతుగా నిర్వహించే ఆందోళనకు ఉంగుటూరు నియోజకవర్గం నుంచి పార్టీ శ్రేణులంతా ఏలూరు తరలిరావాలని ఉంగుటూరు మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు కోరారు. బుధవారం ఆయన క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ రైతులకు కూటమి ప్రభుత్వం చేసిన అన్యాయంపై గళమెత్తడంతోపాటు ధాన్యం కొనుగోలులో ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ ఈ ఆందోళన చేపడుతున్నామని వివరించారు. తేమ శాతం పేరుతో రైతుల వద్ద బస్తాకు రూ.200 నుంచి రూ.400 వరకూ కోత విధిస్తున్నారని, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల వైఫల్యం కారణంగా రైతులు దళారులను ఆశ్రయించిన నష్టపోతున్నారని అన్నారు. అధికారంలోకి వచ్చి ఆరునెలలు పూర్తయినా ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్న చిత్తశుద్ధి కూటమి ప్రభుత్వానికి కనిపించడంలేదన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో నిరాటంకంగా రైతులకు అందించిన రైతుభరోసాకు ప్రస్తుత పాలకులు మంగళం పాడారని, పంటల బీమా ప్రీమియం కూడా రైతులనే కట్టుకోమంటున్నారని, ఆర్‌బీకేల ద్వారా గత ప్రభుత్వం రైతులకు అందించిన సేవలన్నీ మాయమయ్యాయని విమర్శించారు. రైతు వ్యతిరేక చర్యలకు పాల్పడిన కూటమి ప్రభుత్వంపై రైతులు కన్నెర్ర చేస్తున్నారని అన్నారు. ఈ కష్టకాలంలో రైతులకు అండగా నిలవడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఈనెల 13న రాష్ట్రవ్యాప్త ఆందోళనలకు పిలుపునిచ్చారని వివరించారు. ఆరోజు ఉదయం 10 గంటలకు ఫైర్ స్టేషన్ సెంటర్‌లోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం కలెక్టరు కార్యాలయానికి రైతులతో కలిసి ప్రదర్శనగా వెళ్లి వినతిపత్రం సమర్పిస్తామన్నారు. ఈ కార్యక్రమానికి పార్టీ శ్రేణులంతా పెద్దసంఖ్యలో హాజరుకావాలని కోరారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెదపాడు: పాతముప్పర్రులో సబ్‌స్టేషన్ మరమ్మతుల నిమిత్తం శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ వై రాంబాబు తెలిపారు. పాతముప్పర్రు సబ్ స్టేషన్ పరిధిలోని కొత్తూరు, కొత్తముప్పర్రు, పాతముప్పర్రు, జయపురం, వీరమ్మకుంట వెంకటాపురం పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు తెలిపారు.

క్లుప్తంగా

ఆత్మీయ కలయిక





మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన గంటా శ్రీనివాసరావు, కామిరెడ్డి నాని

భీమడోలు/దెందులూరు: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని బుధవారం తాడేపల్లిలోని పార్టీ కేంద్రం కార్యాలయంలో పూళ్ల ఎంపీటీసీ గంటా శ్రీనివాసరావు, వార్డు సభ్యుడు ఓగిరాల సూర్యచంద్రరావు, దెందులూరు మండలం పార్టీ అధ్యక్షుడు కామిరెడ్డి నాని మర్యాదపూర్వకంగా కలిసారు. పార్టీ బలోపేతం కోసం సమష్టిగా పని చేయాలని, ఏ కష్టమొచ్చినా తాను అండగా ఉంటానని జగన్‌మోహన్‌రెడ్డి భరోసా ఇచ్చా రని వారు రాత్రి తెలిపారు. ప్రతి ఒక్కరితో ఆయన మాట్లాడి పార్టీ పరిస్థితులను ఆయన అడిగి తెలుసుకున్నారని, ఆయన చూపిన అభిమానం మరవలేనిదని వారు సంతోషం వ్యక్తం చేశారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం



చిలకంపాడులో వృద్ధురాలికి వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

గణపవరం: పరిసరాల పరిశుభ్రత, దోమల నిర్మూలనతోనే ప్రజలు వ్యాధులకు దూరంగా ఆరోగ్యవంతమైన జీవనం గడపవచ్చునని తాడేపల్లిగూడెం డివిజన్ మలేరియా అధికారి వైవీ లక్ష్మణరావు అన్నారు. బుధవారం మండలంలోని కాశిపాడు, చిలకంపాడులో స్వచ్ఛతా కార్యక్రమాలు, ఆరోగ్యభద్రతపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రజలు ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని కోరారు. వృద్ధులకు బీపీ, సుగర్‌పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

భీమడోలు: జాతీయ రహదారి భీమడోలు కనకదుర్గ ఆలయం వద్ద వరి కోత యంత్రం మంగళవారం రాత్రి ఓ మోటార్ బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వివరాల్లోకి వెళ్లితే మన్యం జిల్లా నక్కపేటకు చెందిన గొర్లి రామకృష్ణ, కెంబూరి రామకృష్ణ ఓ బైక్‌పై భీమడోలులోని కెంబూరి రామకృష్ణ తన కుమార్తెను చేసేందుకు వస్తున్నారు. కనకదుర్గ ఆలయం వద్ద డివైడర్ దాటుతున్న క్రమంలో వరి కోత యంత్రాన్ని డ్రైవర్ నిర్లక్ష్యంగా అతి వేగంగా నడవుతూ బైక్‌ను ఢీకొట్టాడు. బైక్ నడుపుతున్న గొర్ల రామకృష్ణకు తలకు బలమైన గాయాలు, కెంబూరి రామకృష్ణకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై బుధవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు భీమడోలు ఎస్సై వై.సుధాకర్ తెలిపారు.

మాజీ జస్టిస్ సుంకవల్లి పర్వతరావు మృతి

ఉంగుటూరు : దాత ఆర్‌ఎస్‌ఎస్ ప్రముఖుడు, హైకోర్టు మాజీ జస్టిస్ సుంకవల్లి పర్వతరావు (90) బుధవారం హైదరాబాదులో కన్నుమూశారు. ఉంగుటూరులో ఆయనకు ఉన్న ఆస్తిలో 60 సెంట్ల స్థలంలో సుంకవల్లి భారతీయ విద్యాకేంద్రం నిర్మించి విశాఖలో ఉన్న భారతీయ విద్యా కేంద్రానికి అప్పగించారు. ఎంతోమంది ఇక్కడ చదువుకుని ప్రయోజకులుగా మారారు. తన వ్యవసాయ క్షేత్రం 35 ఎకరాల భూమిని గౌతమి సేవాసంస్థకు ఆయన అప్పగించారు. 5 ఎకరాలు భూమిని గోశాలకు వితరణ చేశారు. నాచుగుంటలో నడుస్తున్న గోశాల ప్రకృతి వ్యవసాయ పంటల సాగును ఆయన ఆచరణలోకి తీసుకువచ్చారు. విశ్వహిందూ పరిషత్, ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు పలువురు ఆయన మృతికి సంతాపం తెలిపారు. ఆయన భౌతిక కాయానికి కుటుంబ సభ్యులు హైదరాబాదులోనే అంత్యక్రియలు నిర్వహించారు.

ఉత్సాహంగా క్రీడాపోటీలు ప్రారంభం

దెందులూరు: విజయం చేరుకోవడానికి సరైన ప్రణాళిక, నిరంతర సాధన, క్రమశిక్షణ, సత్ప్రవర్తన కలిగి ఉండాలని, క్రీడాకారులు తప్పనిసరిగా గెలుపోటములను సమానంగా స్వీకరించి ముందుకు వెళ్లాలని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. గురువారం దెందులూరు మండలం గోపన్నపాలెంలోని శ్రీ సీతారామ ప్రభుత్వ వ్యాయామ విద్య కళాశాల ఆవరణలో బాలికల ఖోఖో క్రీడా పోటీలను ఎమ్మెల్యే చింతామనేని ప్రారంభించారు. మండల టీడీపీ అధ్యక్షుడు మాగంటి నారాయణ ప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ నత్తానియేలు, ఒలింపిక్స్ ఏలూరు అసోసియేషన్ అధ్యక్షుడు ఆదిరెడ్డి సత్యనారాయణ, ఖోఖో అసోసియేషన్ అధ్యక్షుడు పీవీ రంగారావు పాల్గొన్నారు

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ గ్రామ సభలు



ఉంగుటూరు మండలం కాకర్లమూడిలో రెవెన్యూ సదస్సులో అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

దెందులూరు: మీ భూమి– మీ హక్కు నినాదంతో భూములకు రక్షణ కల్పించేలా పటిష్టమైన చట్టాలు న్నాయని దీనికి కొనసాగింపుగా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. దెందులూరు మండలం గోపన్నపాలెం గ్రామపంచాయతీ ఆవరణలో బుధవారం మండల ప్రత్యేక అధికారి జిల్లా హౌసింగ్ పీడీ సత్యనారాయణ, తహసీల్దార్ బి సుమతి, దెందులూరు మండలం టీడీపీ అధ్యక్షులు మాగంటి నారాయణ ప్రసాద్ ఆధ్వర్యంలో గ్రామ రెవెన్యూ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ గ్రామ సభలు నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ శ్రీదేవి, గ్రామ టీడీపీ అధ్యక్షుడు చింతా సుబ్బారావు, పలువురు నాయకులు, గ్రామ రెవెన్యూ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో రెవెన్యూ సభలు

పెదవేగి : భూముల హక్కులకు సంబంధించిన వివాదాలను రైతులు రెవెన్యూ సదస్సుల ద్వారా పరిష్కరించుకోవాలని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. పెదవేగి మండలం చక్రాయిగూడెం పంచాయతీ కార్యాలయం వద్ద బుధవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొన్నారు. పెదవేగి ఇన్‌చార్జ్ తహసీల్దారు భ్రమరాంబ, మండల సర్వేయర్ మూర్తి, ఆర్‌ఐ కె సారథి, వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సు

ఉంగుటూరు: ఉంగుటూరు మండలం కాకర్లమూడిలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఏలూరు డీఎల్‌పీవో కె.పి. చంద్ర శేఖర్ అధ్యక్షత వహించారు. సదస్సులో వివిధ సమస్యలపై 8 అర్జీలు వచ్చినట్లు చంద్రశేఖర్ తెలిపారు.

కొక్కిరపాడులో 11 అర్జీలు

పెదపాడు: రైతుల సమస్యలకు పరిష్కారం చూపేందుకు ఈగ్రామ సభలు నిర్వహించినట్లు జిల్లా పంచాయతీ అధికారి కె.అనూరాధ తెలిపారు. మండలంలోని కొక్కిరపాడు గ్రామ పంచాయతీ పరిధిలో బుధవారం ఉదయం కొక్కిరపాడు, మధ్యాహ్నం వేంపాడులో గ్రామసభలు నిర్వహించారు. తహసీల్దార్ ఏ కృష్ణ జ్యోతి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. కొక్కిరపాడు 9, వేంపాడులో నిర్వహించిన గ్రామ సభలో 2 అర్జీలు వచ్చినట్లు అధికారులు తెలిపారు. స్థానిక సర్పంచ్ మరీదు రెడ్డియ్య, ఎంపీటీసీ వీరంకి బుజ్జి, డీఎల్‌పీఓ సూర్య కుమార్, మండల సర్వేయర్ పీ కోదండరామ్, కోటేశ్వరరావు,ఆర్ కృష్ణ పాల్గొన్నారు.

రెవెన్యూ గ్రామ సభలను వినియోగించుకోండి

పెదపాడు: మండలం పరిధిలోని గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సభలను రైతులు వినియోగించుకోవాలని పెదపాడు తహసీల్దార్ కృష్ణజ్యోతి తెలిపారు. ఈనెల 12న కలపర్రు, గోగులంపాడు, 13న వట్లూరు, 17న ముప్పర్రు పునుకొల్లు–2, పెదపాడు–2, రావులకుంట 19న పెదపాడు–2, పెదపాడు–1, పునుకొల్లు–1, 23న రాజుపేట, 26న సత్యవోలు, 27, 28 తేదీల్లో కొనికి, 30న అమృతలింగంపేట, 31 వసంతవాడ–2లో గ్రామసభలు నిర్వహించనున్నట్టు చెప్పారు. జనవరి 2న కొత్తూరు బూరాయిగూడెం, 4న తాళ్లగూడెం, ముప్పర్రు ఈదులకుంట, 6న వసంతవాడ–1, 7న నందికేశ్వరపురం, 8న సకలకొత్తపల్లి, గోగుంట గ్రామాల్లో గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ చెప్పారు.

ఘనంగా గీతా జయంతి



కైకరంలో గీతా జయంతిని నిర్వహిస్తున్న దృశ్యం



గణపవరంలో గీతాపారాయణ చేస్తున్న భక్తులు

ఉంగుటూరు: కైకరం గీతామృత వాహినీ సత్సంగం, సీతారామ గీతార్చన భజన మండలి సంయుక్త ఆధ్వర్యంలో గీతా జయంతిని షష్ఠి మహోత్సవ కళావేదికపై బుధవారం ఘనంగా నిర్వహించారు. సత్సంగ వ్యవస్థాపకుడు కొచ్చెర్లకోట శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో తొలుత భగవద్గీత గ్రంథానికి శాస్త్రోక్తంగా పూజలు చేశారు. చేబ్రోలు వాసి, జాతీయ వయోవృద్ధుల సంఘం నేత వెంపరాల నారాయణ మూర్తి ముఖ్య అతిథిగా పాల్గొని భగవద్గీత వైభవంపై ప్రసంగించారు. అనంతరం వెంపరాలను చింతల శ్రీనివాస్ చేతుల మీదుగా అతిథులను సత్కరించారు. కార్యక్రమంలో షష్ఠి ఉత్సవ కమిటీ అధ్యక్షుడు పామర్తి సత్యనారాయణ మూర్తి, ఎగ్గిన సీతారామ్ కుమార్, సత్సంగ మహిళలు పాల్గొన్నారు.

గణపవరం: గీతా జయంతి సందర్భంగా గణపవరం కన్యకా పరమేశ్వరి వర్తక సంఘ భవనంలో బుధవారం గీతాజయంతిని వైభవంగా నిర్వహించారు. గీతాసారాన్ని ప్రతి ఒక్కరూ తెలుసుకుని ఆచరించాలని రుద్రరాజు ఫౌండేషన్ చైర్మన్ ఆర్‌వీఎస్‌రాజు అన్నారు. సుషుమ్న దివ్యబాబాజీ క్రియాధ్యక్షులు విజయలక్ష్మి, వంకాయల లక్ష్మీకుమారి, మహిళామండలి సభ్యులు, గీతాపారాయణ కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో వర్తక సంఘం ఉపాధ్యక్షుడు వంకాయల రామారావు, బంగార్రాజు పాల్గొన్నారు.

మానవ హక్కులను కాపాడుకుందాం



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ టీకే విశ్వేశ్వరరావు

ఉంగుటూరు: అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం స్థానిక శ్రీ అరవింద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి హెప్సీబా, రాజనీతి శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో విద్యార్థినీ విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తెలుగు రాష్ట్రాల్లో మానవ హక్కుల బాటసారిగా పేరొందిన డాక్టర్ బాలగోపాల్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ప్రిన్సిపాల్ డాక్టర్ టీకే విశ్వేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవ హక్కులను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ముఖ్య వక్తగా విచ్చేసిన పెద్దరాజు మానవ హక్కుల పరిరక్షణలో మీడియా పాత్రను వివరించారు. విశ్వ జనీన మానవ హక్కుల ప్రకటనలోని ఆర్టికల్స్‌ను విద్యార్థులు చదివి వినిపించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తయారు చేసిన పోస్టర్లు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమానికి కళాశాల అధ్యాపకులు రెడ్డియ్య, మణీంద్ర రావు, ఆయేషా, బాబూరావు, రాజు, రామ్మోహన్‌రావు పాల్గొన్నారు.

పంటల బీమా ప్రీమియం చెల్లించాలి



రైతు సేవా కేంద్రంలో రైతులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి ఎస్‌కే హబీబ్ భాషా

భీమడోలు: రైతులంతా పంటల బీమా ప్రీమియం తప్పనిసరిగా చెల్లించాలని జిల్లా వ్యవసాయాధికారి ఎస్‌కే హబీబ్ భాషా అన్నారు. అంబర్‌పేటలో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం రైతు సేవా కేంద్రంలో పంటల బీమా, దాళ్వా సాగులో మెలకువలు, సార్వా ధాన్యం సేకరణ, చెల్లింపులు తదితర అంశాలపై రైతులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ఏవో ఎస్‌పీవీ ఉషారాణి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎస్‌కే హబీబ్ భాషా, ఏడీఏ పి.ఉషారాజకుమారి పలు అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. డీఏవో మాట్లాడుతూ వరి పండించే రైతు ఎకరానికి రూ.500, మొక్కజొన్న రైతులు రూ.483 ఆపరాలకు రూ.60 చొప్పున ప్రీమియం చెల్లించాలన్నారు. వరి రైతుల ఈనెల 30వ తేదీ నాటికి, మొక్కజొన్న, ఆపరాల రైతులు ఈనెల 15వ తేదీ నాటికి ప్రీమియం చెల్లించాలన్నారు. భీమడోలు మండలంలో సార్వా పంటకు సంబంధించి 19,784 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసామని, 2,294 మంది రైతుల ఖాతాల్లో రూ.41.19 కోట్ల నగదును జమ చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ దూసనపూడి పుల్లయ్య, రైతులు ఏసురత్నం, ఆర్.శ్రీరామారావు, వీఏఏ టి.భారతి పాల్గొన్నారు.

ఉంగుటూరు: యర్రమిల్లిపాడు, నలమాడులో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి డాక్టర్ ప్రవీణ్ కుమార్ రైతులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పంటల బీమా ప్రీమియం వెంటనే చెల్లించాలని కోరారు. వరితో పాటు మినుము, పెసలు, మొక్కజొన్న పంటలకు బీమా సౌకర్యం అందుబాటులో ఉందని తెలిపారు.

ఘనంగా యూత్ సెమీ క్రిస్మస్ వేడుకలు

దెందులూరు: దెందులూరు మన్నా చర్చిలో బుధవారం యూత్ సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. చిన్నారులు, యువతీ యువకులు శాంతా క్లాజ్ వేషధారణలో నృత్యాలు చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేసుకుని, ఆధ్యాత్మిక గీతాలు ఆలపించారు. మన్నా చర్చి పాస్టర్ బెంజిమెన్ దంపతులు కేక్ కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.

గురుకుల పాఠశాలలో ముగిసిన శిక్షణ



వట్లూరులో అటల్ టింకరింగ్ శిక్షణలో పాల్గొన్న వారికి సర్టిఫికెట్లు అందిస్తున్న ప్రతినిధులు

పెదపాడు: అటల్ టింకరింగ్ ల్యాబ్‌పై అందించిన శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని రామచంద్ర ఇంజనీరింగ్ కళాశాల హెచ్‌ఆర్ ప్రసాద్ తెలిపారు. వట్లూరులోని బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల వట్లూరులో మూడు రోజులుగా నిర్వహిస్తున్న అటల్ టింకరింగ్ ల్యాబ్ వర్క్‌షాపు బుధవారంతో ముగిసింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రసాద్ మాట్లాడుతూ సైన్స్ ఉపాధ్యాయులు వర్క్ షాపులో తెలుసుకున్న విషయాలను విద్యార్థులకు అందించే బోధనలో వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం వారికి సర్టిఫికెట్స్ ప్రధానం చేసారు. డీఎస్‌ఓ సోమయాజులు కళాశాల ప్రిన్సిపాల్ దాసరి మేరీ ఝాన్సీరాణి తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ శిక్షణతో ఉద్యోగావకాశాలు



పూళ్లలో దేహధారుఢ్య పరీక్షల్లో పాల్గొన్న విద్యార్థులు

భీమడోలు: విద్యార్థుల్లో ఆత్మ స్థైర్యాన్ని నింపేందుకు ఎన్‌సీసీ చక్కని మార్గమని ఎన్‌సీసీ కమాండింగ్ అధికారి కల్నల్ అమిత్ పాండే అన్నారు. పూళ్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం ఎన్‌సీసీలో ప్రథమ సంవత్సరంలో ఆర్మీ వింగ్‌లో చేరే విద్యార్థుల ఎంపిక కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు నాయబ్ సుబేదార్ వినోద్‌కుమార్, హవల్దార్ షిబ్‌దర్శన్ వాగ్‌మారే దేహధారుఢ్య పరీక్షలు నిర్వహించారు. వారిలో ఉత్తమ ప్రతిభను చూపిన 33 మందిని ఎంపిక చేశారు. ఎంపికైన బాలురు 14 మంది, బాలికలు 19 మందిని హెచ్‌ఎం పి.భువనేశ్వరరావు, ఉపాధ్యాయులు అభినందించారు. ఈ సందర్భంగా పాండే మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి ఎన్‌సీసీ (నేషనల్ క్యాడిట్ కార్ప్స్)లో శిక్షణ పొందడం ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగావకాశాలు మెండుగా ఉంటాయన్నారు. క్రమశిక్షణ, పట్టుదల, శ్రమ వంటి లక్షణాలు పెంపొందుతాయన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం పి.భువనేశ్వరరావు, ఎన్‌సీసీ ఏఎన్‌వో కిలపర్తి వెంకటేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.